‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ లబ్ధి

- ప్రజలు సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే సర్టిఫికెట్ల గుర్తింపు
- జూలై 1 నుంచి సచివాలయాల పరిధిలో ఉచితంగా జారీ
- మండలంలో రెండు అధికార బృందాల సేవలు


అమడగుంట్లలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కోడుమూరు: అవసరమైన ధ్రువపత్రాలు లేక ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రావడం లేదనే బాధ ప్రజలకు తీరనుంది. ధ్రువపత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘జగనన్న సురక్ష’ పథకం పేద ప్రజలకు వరంగా మారింది. సాంకేతిక కారణాలు చూపి సర్టిఫికెట్లు రావడం లేదనే సాకులు ఇకపై అధికారులు చెప్పరు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం చూపి ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్లను అందించే గొప్ప కార్యక్రమం ‘జగనన్న సురక్ష’ పథకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ఈనెల 23వ తేదీన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి అధికారులు సర్వే నిర్వహించారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం ప్రణాళికబద్ధంగా అధికారులకు శిక్షణ ఇచ్చింది. వారం రోజుల పాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. జూలై 1 నుంచి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన సేవలు అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కోడుమూరు నియోజకవర్గంలోని 92 సచివాలయాలున్నాయి. సచివాలయాల వారీగా అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేయనున్నారు. జూలై 1 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తహసీల్దార్, ఎంపీడీఓలతో సహా వివిధ మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుంది. క్యాంపుల నిర్వహణ సమయంలో దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తారు. ఆయా డెస్క్‌లలో మండలస్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది వారివారి బాధ్యతలు నిర్వహిస్తారు.

సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఇలా..

గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బృందంలో ముగ్గురు మండలస్థాయి అధికారులు ఉండేలా ప్రణాళికను సిద్ధం చేశారు. జగనన్న సురక్ష పథకం పర్యవేక్షణ కోసం నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించనుంది. సచివాలయాల పరిధిలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంపై ముందుగా ఆయా గ్రామాల ప్రజలకు తెలిసేలా తగిన చర్యలు తీసుకోనున్నారు. మ్యుటేషన్ ఆఫ్ ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించి పాస్ పుస్తకాల జారీకి దరఖాస్తుదారుడు చార్జీలను చెల్లించాల్సి ఉంది.

మండలానికి రెండు గ్రామాల ఎంపిక

జగనన్న సురక్ష కార్యక్రమం జూన్ 23న ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కింద మండలానికి రెండు గ్రామాలను అధికారులు సర్వే చేశారు. కోడుమూరు మండలంలోని అమడగుంట్ల, వెంకటగిరి, గూడూరు మండలంలో ఆర్.ఖానాపురం, పెంచికలపాడు, కర్నూలు మండలంలో పంచలింగాల, బి.తాండ్రపాడు, సి.బెళగల్ మండలంలో పలుకుదొడ్డి, చింతమానుపల్లె గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారుల బృందం సర్వే నిర్వహించారు. కుల ధ్రువీకరణ, ఆదాయం, ఆధార్ కార్డు, వివాహ సర్టిఫికెట్, భూముల సమస్యలు, ఆధార్ కార్డు ఫోన్ లింకప్ తదితర సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి.

సర్వీస్ చార్జీలు లేకుండా అందించే సేవలివే

ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు), ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ (భూమి కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు), మ్యుటేషన్ ఫర్ కరెక్షన్ (భూమి వివరాల నమోదులో మార్పులు), వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో సెల్ నెంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డు, కొత్త రేషన్‌కార్డు మంజూరు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాలు కొందరి సభ్యుల పేర్ల తొలగింపు వంటి సేవలు అందించనున్నారు.

ఉచితంగా ధ్రువపత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కోడుమూరు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా వెంకటగిరి, అమడగుంట్ల గ్రామాల్లో సర్వే నిర్వహించారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష పథకం అమలు కోసం అన్ని గ్రామాలలో దండోరా వేయించి సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తాం. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తాం. – చంద్రశేఖర్, ఎంపీడీఓ

నేడు కోడుమూరులో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్: పట్టణంలోని గ్రామ సచివాలయం–4 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

‘జగనన్న సురక్ష’ను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

గూడూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకునివెళ్లాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. పెంచికలపాడులో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆర్.ఖానాపురం, పెంచికలపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

● **సి.బెళగల్:** జగనన్న సురక్ష సదస్సులు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం చింతమానుపల్లెలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్‌ల ఆధ్వర్యంలో, సంగాల గ్రామంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తుల ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలి


విద్యుత్ ఏడీఈకు వినతిపత్రం ఇస్తున్న వామపక్ష నేతలు

సి.బెళగల్: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్ష పార్టీల నేతలు అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈ జాసన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కోడుమూరు మండల కార్యదర్శి రాజు, సీపీఎం జిల్లా నాయకుడు రాఘవేంద్ర, నాయకులు మల్లికార్జున, ఖాజా, బుజ్జీ, హనుమంతు, జైలు, శేషు, నాగరాజు, దుబ్బన్న, వెంకటేష్, రాముడు పాల్గొన్నారు.

పంటల బీమా అర్హుల జాబితా విడుదల

కోడుమూరు రూరల్: మండలంలో గత ఏడాది తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పరిహారం అందించేందుకు అర్హులైన రైతుల జాబితాను విడుదల చేసింది. శుక్రవారం మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ పంట నష్టపరిహారం రైతుల జాబితాను స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ గత ఏడాది పంటలు సాగు చేసి నష్టపోయిన 14,576 మంది రైతులకు ప్రభుత్వం రూ.9,44,82,836లను అందించేందుకు జాబితాను సిద్ధం చేసిందన్నారు

రీ సర్వేతో భూ తగాదాలకు పరిష్కారం


పోలకల్ పొలాల్లో రీ సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: భూ తగాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీ సర్వే దోహదపడుతోందని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శుక్రవారం పోలకల్ పరిధిలోని పొలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను తనిఖీ చేశారు. భూ సరిహద్దుల విషయంలో జాగ్రతలను వహించాలని, రైతులకు సర్వేపై అవగాహన కల్పించి, న్యాయబద్ధమైన సూచనలతో వారిని చైతన్య పరచాలని ఆయన వీఆర్వోలు, సర్వే సహాయకులకు సూచించారు. ఆయన వెంట రీ సర్వే డీటీ కృష్ణమూర్తి ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి.. డీటీ కృష్ణమూర్తితో కలిసి సర్వే సభ్యులతో సమావేశమై,సర్వేపై పలు సూచనలు ఇచ్చారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు


ఆకట్టుకున్న ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యుల కీర్తనలు

గూడూరు: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ద్వాదశి సంబరాలు వైభవంగా జరిగాయి. ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు పట్టణంలో పాండు రంగడు కీర్తనలు ఆలపిస్తూ సంబరాలు చేసుకున్నారు.

గ్రామ కంఠాన్ని కాపాడండి

గూడూరు: ఆక్రమణదారుల నుంచి గ్రామ కంఠాన్ని కాపాడాలని మండలంలోని చనుగొండ్ల గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. 5 సెంట్ల గ్రామ కంఠాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని, ఆక్రమణ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయగా విచారించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సుబ్రమణ్యేశ్వరుడి ఆదాయం రూ.20 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గత మార్చి 27 నుంచి శుక్రవారం వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించగా రూ.20,72,234 నగదు, 6 గ్రాముల బంగారు, 1505 గ్రాముల వెండి లభించిందన్నారు. దేవాదాయశాఖ డివిజన్ అధికారి శివకుమార్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. నంద్యాల సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులో కార్పొరేటర్ నారాయణ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారిని శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, భీమేష్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, సత్యం రెడ్డి, రామకృష్ణ, హనుమంతురెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గంలో జులై 1 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న సురక్ష పేరుతో ప్రజలకు వంద శాతం పథకాలు అమలు చేస్తామని చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, నాయకులు శేషిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలో శనివారం నేటి నుంచి జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం కె.మార్కపురం, చిన్నటేకూరు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గ్రామాల్లో పర్యటించారు. అర్హులై ఉండి పథకాలు రాని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.టి.సాయిప్రదీప్

కర్నూలు (న్యూటౌన్): చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.టి.సాయిప్రదీప్ అన్నారు. శుక్రవారం మునగాలపాడులోని 38వ సచివాలయం పరిధిలో కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించడం. ఈ సందర్భంగా సాయిప్రదీప్ మాట్లాడుతూ.. ఆధునిక నాగరిక ప్రపంచంలో ఇంకా అంటరానితనం, కుల వివక్ష గ్రామాల్లో కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి కులం, మతం విభేదాలు లేకుండా జీవించాలన్నారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమస్యలు లేకుండా శాంతియుతంగా జీవించాలన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీఆర్వో మద్దిలేటి, సోషల్ రిసోర్స్ పర్సన్ మాధవ కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లోనే వర్షపు నీరు

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో చిన్నపాటి వర్షానికే గ్రామంలోని రహదారులు బురదమయంగా మారుతున్నాయి. వర్షపు నీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిల్వ ఉంటోంది. గ్రామంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఊరి చివరి వరకు వీధుల్లో నీరు నిల్వ ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పనికి వెళ్లాలంటే బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రధాన రహదారుల్లో సైతం వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కరిమద్దెల గ్రామం ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న నీరు

ఇంటి ముంగిటకే పింఛన్

- పండుటాకులకు తప్పిన తిప్పలు
- నేటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ


లద్దగిరిలో లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లి వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల మజారా గ్రామమైన కొత్తపల్లెకు చెందిన వృద్ధురాలు రామక్క గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం 5 కిలోమీటర్లు మట్టి రోడ్డు మార్గాన నడిచి వచ్చి గోరంట్ల గ్రామంలో పింఛన్ తీసుకుని వెళ్లేది. ఆ రోజు సర్వర్‌పని చేయకుంటే మరుసటి రోజు వెళ్లాల్సి వచ్చేది. ఇలా పింఛన్ తీసుకోవాలంటే ప్రతి నెలా ఒకటి రెండు రోజులు చేతగాని వయస్సులో పడిగాపులు కాయాల్సివచ్చేది. ఈ కష్టాలన్నీ చెరిపేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో కొచ్చినప్పటి నుంచి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్ అందజేస్తుండడంతో ఆ వృద్ధురాలు ఆనందంగా పింఛన్ అందుకుంటోంది.

నాడు పడిగాపులు..
నేడు ఇంటి ముంగిటకే పింఛన్

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చేది. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. సర్వర్ పనిచేయకుంటే రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. పింఛన్ల కోసం పండుటాకులు పడుతున్న కష్టాలను చూసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవశకానికి నాంది పలుకుతూ అధికారంలోకొచ్చిన వెంటనే గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ వచ్చి లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రతి పింఛన్‌దారుడి ముఖంలో చిరునవ్వుతో ఇంటి వద్దనే పింఛన్ తీసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు నెలకు రూ. 2,750 పింఛన్ అందిస్తుండగా, దివ్యాంగులకు రూ.3 వేలు, పక్షవాత రోగులకు రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేల చొప్పున పింఛన్ అందజేస్తున్నారు. కోడుమూరు మండలంలో 8,781, గూడూరులో 5,386, సి.బెళగల్‌లో 7,046, కర్నూలులో 9,943 మంది లబ్ధిదారులకు 1వ తేదీ శనివారం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు.

నడుము లోతు నీటిలో వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది



గోరంట్ల పంచాయతీ కార్యాలయంలో ఇచ్చే పింఛన్ డబ్బు కోసం కొత్తపల్లె నుంచి రాను పోను 10 కిలోమీటర్లు నడిచి వెళ్లి పింఛన్ తెచ్చుకునేవాడిని. ఒక్కోసారి వానలకు హంద్రీలో నడుముల్లోతు నీళ్లు పారుతున్నా పింఛన్ కోసం అలాగే వెళ్లాల్సి వచ్చేది. అయితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చినప్పటి నుంచి ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి వేలిముద్ర వేయించుకుని డబ్బులిచ్చి వెళ్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. – కాశ చక్రవర్తి, కొత్తపల్లె గ్రామం, కోడుమూరు మండలం

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

జూలై 1వతేదీ నుంచి మండలంలో పింఛన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు అన్ని తీసుకున్నాం. పింఛన్‌దారుల సొమ్ము కూడా సచివాలయాల వారిగా బ్యాంకు నుంచి అందజేయడం జరిగింది. జూలై 1నుంచి 5వ తేదీ వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తాం.
– చంద్రశేఖర్, ఎంపీడీఓ, కోడుమూరు

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నట్లు శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉందని వారు పేర్కొన్నారు.

రూ.2.73 కోట్ల పంటల బీమా మంజూరు

గడివేముల: మండల పరిధిలోని 14 ఆర్బీకేల పరిధిలో గతేడాది సాగు చేసిన పంటలు వివిధ కారణాలతో దెబ్బతినడంతో ప్రభుత్వం రూ.2.73 కోట్లు పరిహారం మంజూరు చేసినట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. రబీ సీజన్‌లో 1,478 మంది రైతులకు గాను 3661 ఎకరాల్లో పంట నష్టం జరినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. ఈ మేరకు పరిహారం మంజూరైంది.

2న సబ్ జూనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు (రూరల్): నగరంలోని పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జులై 2వ తేదీన జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఉషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉషూ సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ పోటీలకు 14 సంవత్సరాల లోపు వారు, జూనియర్ పోటీలకు 17 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఉదయం 7 నుంచి 9:30 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డుతో నేరుగా హాజరుకావాలన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచినవారు జూలై 15, 16 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9440047196 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, ఇందుకు ప్రత్యేకంగా 1930 అనే టోల్ ఫ్రీ నంబరు సైతం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సుభాష్ సురేష్ కాలే, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ వేదమణి

ఓర్వకల్లు: రైతుల అవసరతను బట్టి నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వేదమణి అన్నారు. జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం గ్రామాలలో గల విత్తన దుకాణాలను ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వేదమణి మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైన నాసిరకం, నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయా దుకాణాలలో స్టాకును పరిశీలించారు. డీఆర్‌సీ ఏఓ హేమలత, ఏఓ సుధాకర్ వెంట ఉన్నారు.

విద్యారంగంలో ఆదర్శంగా ఏపీ



సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కర్నూలు (టౌన్): విద్యారంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోడుమూరు నియోజకవర్గం గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ‘జగనన్న అమ్మ ఒడి’ పథకం ద్వారా లబ్ధిపొందిన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలు వారు పిల్లలను చదివించుకునేందుకు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి పథకం ద్వారా రూ.6,393 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశాడన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో రాణించాలన్నారు. విద్యార్థులు సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించడమే గాకుండా జగనన్న అమ్మ ఒడి అనే ఆకారంలో కూర్చుని స్ఫూర్తి చాటారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సర్పంచ్ యేసేపు, ఎంపీటీసీ సురేష్, హెచ్ఎం వెంకటరాముడు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేమడూరు గ్రామానికి చెందిన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. రేమడూరు గ్రామానికి చెందిన పి.శివయ్య (20) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. చిన్నప్పటి నుంచి ఎడమ కాలి అంగవైకల్యంతో బాధ పడుతున్నాడు. పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తుండగా తనకు ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని కుటుంబ సభ్యులతో వాదించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం సెంట్రింగ్ పని ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. తాను బతికి ఉంటే కదా పెళ్లి సంబంధాలు చూడటానికి అనుకుంటూ బయటకు వెళ్లాడు. రాత్రి భోజనం చేసి మిద్దెపైన ఉన్న గదిలో పడుకున్నాడు. ఉదయం సెంట్రింగ్ పనికి పిలిచేందుకు తమ్ముడు మహేష్ గదిలోకి వెళ్లి చూడగా శివయ్య చౌకట్‌కు చీరతో ఉరి వేసుకుని నిర్జీవంగా కనిపించాడు. మృతుడి తల్లి సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.